క్లుప్తంగా

పీఎంపీ వైద్యుల అభివృద్ధికి సహకరించాలి



కార్తీక వనసమారాధన కార్యక్రమంలో శివరామకృష్ణను సత్కరిస్తున్న వైద్యులు

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలోని పీఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివరామ కృష్ణ, కార్యదర్శి రమేష్‌బాబు కోరారు. ఏలూరుకు సమీపంలోని తోటలో ఆదివారం శ్రీకృష్ణ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎంపీ వైద్యుల సంక్షేమం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఆస్పత్రి డాక్టర్ బి.కృష్ణ, ప్రముఖ ఎండోక్రైనాజలీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ నాయుడు, డాక్టర్ గౌరీపతి, డాక్టర్ ఏసుపాదం, మురళీ, రవివర్మ, సురేష్, రమణమూర్తి, తదితర ప్రముఖులతో పాటు 400 మంది పీఎంపీ డాక్టర్లు, శ్రీ కృష్ణ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్లపై దిగొచ్చిన ప్రభుత్వం

ఏలూరు రూరల్: కూలి రేట్లపై హమాలీలు చేసిన ఆందోళన సత్ఫలితం ఇచ్చిందని ఏలూరు జిల్లా పౌర సరఫరా సంస్థ హమాలీల సంఘం అధ్యక్షుడు శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కూలి రేట్లు పెంచాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన హమాలీలు చేసిన నిరసనపై కూటమి ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హమాలీల సంఘం రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపారని వివరించారు. ఇందులో క్వింటాకు రూ.3 కూలి రేటు పెంచేందుకు అంగీకరించారని, దీనివల్ల ఇప్పటివరకూ క్వింటాకు రూ.25 ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రూ.28 అందిస్తుందన్నారు. ఈ నిర్ణయంతో పెరిగిన నిత్యావసర ధరలతో అవస్థలు పడుతున్న వందలాది మంది హమాలీలకు మేలు జరుగుతుందన్నారు.

నేడు వార్షిక కలశ పూజ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడులోని శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో సోమవారం 13వ వార్షిక కలశ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటలకు ఆలయ ప్రాంగణం నుంచి ఉత్సవ మూర్తితో బయలుదేరి స్థానిక పడమర లాకుల సమీపంలోని సాయిబాబా మందిరం వద్ద కృష్ణ కాలువలో ఆరాట్టు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం సాయంత్రం ఆలయంలో డీటీవీ పవన్ కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో కేరళ తాంత్రిక విధానంలో పడి పూజ, అయ్యప్ప భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఎనీ టైమ్ తంటా..

- ఉత్సవ విగ్రహాల్లా ఏటీఎంలు
- ఆదివారం వస్తే ఏటీఎంలలో డబ్బులుండవ్
- పనిచేయని పాస్‌బుక్ ప్రింటింగ్ కియోస్క్‌లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తమ ఖాతాదారులు ఖాతాల్లో ఉన్న నగదును అన్నివేళలా తీసుకునేందుకు వీలుగా బ్యాంకులు ఏటీఎంలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఏటీఎం అంటే ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ అని అర్థం. ప్రజలు దీనిని ముద్దుగా ఎనీ టైమ్ మనీ అని పిలుచుకుంటారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏటీఎంలతో ప్రజలు ఎనీ టైమ్ తంటా అన్నట్టుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు నగరంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వివిధ బ్యాంకులు ఏర్పాటు చేసిన ఏటీఎంలు అవసరానికి ఉపయోగపడడం లేదని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా నగదు లావాదేవీలు చేసుకుందామని వెళితే అవి పని చేయకుండా తమను వెక్కిరిస్తూ దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు.

పనిచేయని ఏటీఎంలు

వివిధ బ్యాంకులు ఆయా ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లతోపాటు పేటల్లో కూడా ఏటీఎంలు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఏటీఎంలు ఉత్సవ విగ్రహాల్లానే ఉంటున్నాయంటున్నారు. ఎప్పుడు చూసినా పని చేయని ఏటీఎంలు దర్శనమిస్తున్నాయని, కొన్ని పనిచేస్తున్నా వాటిలో నగదు ఉండక ఖాతాదారులకు నిరుపయోగంగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో ఉండడానికి నాలుగైదు ఏటీఎంలు, డిపాజిట్ మెషీన్లు ఉన్నా వాటిలో పని చేసేవి ఒకటో రెండో ఉంటున్నాయని, మిగిలినవి ఎప్పుడూ పని చేయవని చెబుతున్నారు. దీనితో పాటు యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ వంటి పెద్ద పెద్ద బ్యాంకులు ఏర్పాటు చేసిన ఏటీఎం మెషీన్లు ఖాతాదారులకు అవసరమైన సమయాల్లో సేవలందించడంలేదని వాపోతున్నారు.

ఆదివారం వస్తే తిప్పలే

ఆదివారం వస్తే ఖాతాదారుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా బ్యాంకులకు రెండు, నాల్గవ శనివారాల్లో సెలవు దినాలు కావడంతో శుక్రవారం ఏటీఎంలలో నింపే నగదు శనివారం నాటికే అయిపోతోంది. దీంతో ఇక ఆదివారం ఖాతాదారులు నగదు కోసం నగరంలోని ఏటీఎంలు అన్నీ కలియ తిరగాల్సిందే. ఎక్కడో పెద్దగా జన సంచారంలేని ప్రాంతాల్లోని ఏటీఎంలలో అదృష్టవశాత్తు నగదు లభ్యమైతే అయినట్టు. లేకుంటే సోమవారం బ్యాంకు ఉద్యోగులు వచ్చి అన్నీ సర్దుకుని ఏ మధ్యాహ్నానికో ఏటీఎంలలో నగదు నింపిన తరువాత గానీ ఖాతాదారులకు నగదు అందుబాటులోకి రాదు.

పాస్‌బుక్ ప్రింటింగ్‌కు అవస్థలే

ఏటీఎంలతో ఇలా తిప్పలు పడే ఖాతాదారులు పాస్‌బుక్ ప్రింటింగ్ కియోస్క్‌లు పని చేయక మరో రకంగా ఇబ్బంది పడుతున్నారు. తమ లావాదేవీలకు సంబంధించి పాస్‌బుక్‌లో స్టేట్‌మెంట్ ప్రింట్ చేయమని బ్యాంకుల్లోకి వెళితే అక్కడి సిబ్బంది ఏటీఎంలలో ఉండే కియోస్క్‌లు ఉపయోగించుకోవాలని ఉచిత సలహా పడేస్తున్నారు. సరే వారు చెప్పినట్టుగానే ఏటీఎంలలో ఉండే ప్రింటింగ్ కియోస్క్‌లలో పాస్ బుక్ పెడితే అసలు పాస్ బుక్‌ను లోపలికి తీసుకోదు. ఒకవేళ తీసుకున్నా ప్రింటింగ్ పడదు, ప్రింటింగ్ పడినా అది కంటికి కనిపించదు. పోనీ మినీ స్టేట్‌మెంట్ తీసుకుందామంటే ఏటీఎం మెషీన్‌లో అందుకు సరిపడా పేపర్ అందుబాటులో ఉండక స్టేట్‌మెంట్ ప్రింట్ రాదు. ఇటువంటి ఇబ్బందులు పడుతున్నా బ్యాంకు అధికారుల్లో చలనమే ఉండదని, ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కరించే దిశగా బ్యాంకు అధికారులు తీసుకునే చర్యలు శూన్యమని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు.



నగదు విడుదల చేయలేనని మోనిటర్‌పై దర్శనమిస్తున్న నగరంలోని ఒక ఏటీఎం

ఏటీఎంలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి



ఏటీఎంలు అంటేనే ఎప్పుడు పడితే అప్పుడు, అత్యవసర సమయాల్లో నగదు తీసుకునే అవకాశం కల్పించే యంత్రాలు. ముఖ్యంగా సెలవు దినాల్లో నగదును తీసుకోవడానికి ఏటీఎంలకు వెళ్తే అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మాకు అవసరమైనప్పుడు ఏటీఎంలు ఉపయోగపడడం లేదు.

– గౌతిన రామకృష్ణ, బ్యాంక్ ఖాతాదారుడు

చార్జీలు వసూలు చేయకండి



ఏటీఎం, డిపాజిట్ మెషీన్ల నిర్వహణకు ఖాతాదారుల నుంచి బ్యాంకర్లు చార్జీలు వసూలు చేస్తారు. ఏడాదికి దాదాపు రూ.150 ప్రతి ఖాతాదారుడి నుంచి ఖచ్చితంగా వసూలు చేసే బ్యాంకులు సేవల విషయంలో అంతే ఖచ్చితత్వం ఎందుకు పాటించరు.

– బండ్లమూడి సునీల్, బ్యాంక్ ఖాతాదారుడు

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



వనసమారాధనలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైనవనీ.. భిన్నత్వంలో ఏకత్వంతో ప్రజలంతా స్వేచ్ఛగా, ఐక్యంగా జీవించేందుకు మన సంప్రదాయాలే దిశానిర్దేశం చేస్తాయని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ అన్నారు. శ్రీ శయన సంక్షేమ సంఘం ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విలువలతో కూడిన సంప్రదాయాలను మన పూర్వీకుల ఆచరించారనీ, వాటిని మనం పరిరక్షించుకుంటూ భవిష్యత్ తరాలకు మరింత ఉన్నతమైన రీతిలో అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం జయప్రకాష్‌ను సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శయన సంక్షేమ సంఘం నాయకులు ఫణి, సత్యనారాయణ, వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పాఠశాల పరిసరాల్లో చెత్త కంపు



శనివారపుపేట జెడ్పీ పాఠశాల గేటు వద్ద పేరుకుపోయిన చెత్త

ఏలూరు రూరల్: శనివారపుపేట జెడ్పీ పాఠశాల పరిసరాలు కంపు కొడుతున్నాయి. పిల్లలు, ఉపాధ్యాయులు అపరిశుభ్ర వాతావరణంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. కొద్దిరోజులుగా పాఠశాల ప్రధాన గేటు వద్ద చెత్త చెదారం దర్శనమిస్తోంది. స్థానిక నివాసితులు పాఠశాల రోడ్డు పక్క చెత్త పోస్తున్నారు. దీంతో పాఠశాల పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. పారిశుద్ధ్యం సిబ్బంది స్పందించి చెత్త ఎత్తివేసే వరకూ పరిస్థితి మారడం లేదు. ప్రజారోగ్య అధికారులు స్పందించి చెత్త రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కొయ్యలగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ప్రజా ధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ సంఘం కోరింది. ప్రజాధర్నాకు సంబంధించి ఆదివారం కరపత్రాలను నేతలు విడుదల చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. వివిధ రంగాల వర్కర్లు, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ఆకుల దుర్గారావు, సీహెచ్ సత్యనారాయణ, సీహెచ్ మరిడియ పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యత చాటుకోవాలి



బ్రాహ్మణ సేవా సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భారతీయ సంస్కృతిని పటిష్టం చేయడం కోసం, సమస్యల పరిష్కారానికి బ్రాహ్మణులు ఐక్యత చాటుకోవాలని బ్రాహ్మణ సాధికారిక కమిటీ జిల్లా కన్వీనర్, హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ పిలుపునిచ్చారు. హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం 42వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశం, కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం స్థానిక మినీ బైపాస్ రోడ్డులోని బ్రాహ్మణ భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. పేదరిక స్థాయికి దిగువన ఉన్న బ్రాహ్మణులందరికీ సామాజిక పింఛన్లు, ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత బ్రాహ్మణ సంఘ సభ్యులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, కార్తీక పూజ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి, అంబికా రాజాలను ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మెరపాకల భానుమూర్తి, డీవీఎస్ సుబ్బారావు, పాలంకి దుర్గా ప్రభాకరం, కేవీఎస్ శర్మ, తమ్మెర రామారావు, ఎంఎన్ శర్మ, గురు ప్రసాద్ మిశ్రా, నిట్టల నాగేశ్వర రావు, సగరం బాల వెంకట సుబ్రహ్మణ్యం, తూములూరి విశ్వనాథ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 'అభయం'

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఏర్పాటు చేసిన 'అభయ' రక్షక దళం మహిళలకు అండగా నిలుస్తోంది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్సై క్రాంతిప్రియ పర్యవేక్షణలో నగరంలో 5 అభయ పోలీస్ టీంలు నిత్యం పార్కులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థినీ, విద్యార్థులకు, యువకులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఈవ్ టీజింగ్, మహిళలపై దాడులు, వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ హెచ్చరిస్తున్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే తక్షణమే డయల్ 112కు ఫోన్ చేయాలని కోరుతున్నారు. కేవలం 10 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలుస్తామంటున్నారు.



పార్కుల్లో యువతకు అవగాహన కల్పిస్తూ..



విద్యార్థినులకు భరోసా ఇస్తూ..

అత్యవసర సెలవుల తగ్గింపుపై పునరాలోచించాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో నినాదాలు చేస్తున్న బీటీఏ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులకు ఇచ్చే అత్యవసర సెలవులను మండలం మొత్తం మీద 10 శాతానికి పరిమితం చేయాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను పునరాలోచించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు కోరారు. బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక శనివారపుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చే అత్యవసర సెలవులను తగ్గించడం సరికాదని, గతంలో మాదిరగానే పాఠశాల స్థాయిలో 50 శాతం వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటీఏ ఏలూరు జిల్లా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. ఈ సమావేశానికి బీటీఏ ఏలూరు జిల్లా అధ్యక్షుడు జీ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు బీ మనోజ్ కుమార్, కే గిరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ధర్మలింగం, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతానికి కృషి చేయాలి



హేలాపురి బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హేలాపురి బాలోత్సవం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టెప్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో బాలోత్సవం పోస్టర్‌ను ఆహ్వాన సంఘం పెద్దలు, వ్యక్తిత్వ వికాస విద్యాలయాల అధిపతులు, టీచర్స్ సమక్షంలో ప్రత్యూష సుబ్బారావు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యాలయాల ప్రతినిధులు, టీచర్లు విద్యార్థులను బాలోత్సవానికి సిద్ధం చేయాలని కోరారు. పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ ఫెస్ట్ స్కూల్‌లో నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వీజీఎంవీఆర్ కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ గుడిపాటి నరసింహారావు, సిద్ధార్థ విద్యాలయం చైర్మన్ కే సురేష్ బాబు, కే సిద్ధార్థ, అపుస్మా ఏలూరు గౌరవ అధ్యక్షుడు మార్గాని నాగ శ్రీకాంత్, శర్వాణి విద్యాసంస్థల డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07, 10
బెండకాయలు	30	కంద	80
పచ్చిమిర్చి	24-28	బీట్‌రూట్	60
కాకర కాయలు	30	కీరా దోస	32
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	68
బీరకాయలు (పందిరి)	40	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	76	పాలకూర	12
దొండకాయలు	30	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-55	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	46

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి



వ్యాధులపై జైల్‌లో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం బాలాజీ

ఏలూరు (మెట్రో) : ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగి దాని నియంత్రణ, నివారణకు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి బాలాజీ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ (ఇంటిగ్రేటెడ్, ఎస్‌టీఐ, టీబీ, హెపటైటిస్-సి, హెపటైటిస్-బీ) ఇక్షిత్ అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లా జైల్‌లో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉచితంగా హెచ్‌ఐవీ, టీబీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి పరీక్షలు నిర్వహించారు. జిల్లా జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆర్‌వీ స్వామి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె వినోద్‌కుమార్, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను వేలేరుపాడులో ఏర్పాటు చేయాలి

వేలేరుపాడు: గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వేలేరుపాడు మండలంలో లేకపోవటం బాధాకరమని గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల శ్రీనివాసరావు అన్నారు. వేలేరుపాడు మండల పరిధిలో ఉన్న ఏకైక ఆశ్రమ బాలుర పాఠశాలను 2022 వరదల సమయంలో బుట్టాయగూడెం మండలం లంకపాకలకు తరలించారన్నారు. ఇక్కడ ఉన్నటువంటి గిరిజన విద్యార్థులు చాలామంది ఆ స్కూల్‌కి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులు అనారోగ్యం పాలై డ్రాప్ అవుట్ అవుతున్నారని, బాలుర నిరక్షరాస్యత పెరుగుతుందన్నారు. లంకపాకలకి సరైన రవాణా సదుపాయం లేదని, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించి చొరవ చూపాలని కోరారు.

నేటి నుంచి 108 ఉద్యోగుల సమ్మె బాట

- 15 డిమాండ్ల సాధన కోసం పట్టు
- నిలిచిపోనున్న అత్యవసర సేవలు

బుట్టాయగూడెం: అపర సంజీవని 108 అంబులెన్స్ సేవలు నేటి నుంచి నిలిచిపోనున్నాయి. ప్రజలకు అత్యవసరంగా తమ వంతు సాయం అందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడే 108 సిబ్బంది నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 108 సిబ్బంది పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే సిబ్బంది పలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 25లోగా ప్రభుత్వం స్పందించకపోతే సేవలు నిలిపివేస్తామంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే ముందస్తు నోటీసులను ఉన్నతాధికారులకు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి నుంచి 108 అంబులెన్స్ సేవలను నిలిపివేస్తూ సిబ్బంది సమ్మెబాట పట్టనున్నారు.

రోగులకు అవస్థలే

24 గంటలు అత్యవసర సేవలు అందిస్తున్న 108 ఉద్యోగులు సమ్మెబాట పట్టడం వల్ల రోగులకు పాట్లు తప్పవని అనిపిస్తుంది. ఇప్పటికే పలు మండలాల్లో 108 వాహనాల మరమ్మతు పేరుతో సేవలు దూరమయ్యాయి. ఇప్పుడు సిబ్బంది సమ్మెబాట పట్టడం వల్ల డయాలసిస్ రోగులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల బారిన పడే క్షతగాత్రులను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

108 ఉద్యోగుల డిమాండ్లు ఇవే

- 108 సర్వీసులోని ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నెంబర్ 49ను పునరుద్ధరించాలి. ఫైలట్ గ్రాట్యుటీ, ఎర్నడ్ లీవు అమౌంట్ (అర్హత సెలవు మొత్తం) వార్షిక ఇంక్రిమెంట్‌ను చెల్లించాలి.
- ప్రతీ నెలా జీతాల చెల్లింపు 5లోగా జరగాలి. 108 వాహనంలో షిఫ్టుల పద్ధతే అమలు చేయాలి.
- వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలి.
- 108 సర్వీసులో ఈఎంటీలుగా పనిచేస్తున్న వారి సర్వీసును పరిగణనలోకి తీసుకుని వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టులను నియమించాలి.
- రెండు షిఫ్టులలో షిఫ్టుకు 12 గంటల చొప్పున తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్న తమకు మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పనిదినాన్ని అమలు పరచాలి.
- వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచాలి. వాహనం మరమ్మతు బిల్లులు ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- 108 వాహనానికి, దానిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన భవనాన్ని నిర్మించాలి.



తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

మా సమస్యలు పరిష్కరించాలి



108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్నాం. ఎన్నో సంవత్సరాల నుంచి 108 వాహనంలో పనిచేస్తున్నాం. మా సమస్యలు విని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేసి న్యాయం చేయాలి.

– డి.రాం ప్రసాద్, 108 సిబ్బంది, బుట్టాయగూడెం

షిఫ్టుల పద్ధతి అమలు చేయాలి



ప్రస్తుతం ఉన్న 12 గంటల డ్యూటీ విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. దీనివల్ల పని ఒత్తిడి తగ్గుతుంది. మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

– కె.ఆనందరావు, 108 సిబ్బంది, జంగారెడ్డిగూడెం